సాక్షి చిత్తూరు

గురువారం : 9 : మే : 2024



సంక్షేమ వెలుగులు..

చిత్తూరు నియోజకవర్గంలో 'సాక్షి' బృందం బుధవారం పర్యటించింది. ప్రజాభిప్రాయం సేకరించింది. - 8లో



శ్రీవారి సేవలో సైనా జైస్వాల్

తిరుమల శ్రీవారిని బుధవారం ఇండియన్ టేబుల్ టెన్నిస్ ప్లేయర్ సైనా జైస్వాల్ దర్శించుకున్నారు.



వైఎస్సార్‌సీపీలోకి వలసలు

పలమనేరు నియోజకవర్గంలో టీడీపీ, జనసేన నుంచి పలువురు నేతలు వైఎస్సార్‌సీపీలో బుధవారం చేరారు. - 8లో

ఆక్రమణల అనకొండ ఆరణి



గుడిపాల మండలం పానాటూరు వద్ద ఆరణి కబ్జా చేసిన ప్రభుత్వ భూమి

విలువలు లేవు.. సిద్ధాంతాలు లేవు.. పార్టీలతో పనిలేదు.. ఏదో ఒక జెండా నీడలో టికెట్ తెచ్చుకోవడం.. పోటీ చేయడం.. కాసులు వెదజల్లడం.. ఓటర్లను ప్రలోభపెట్టడం.. నమ్మి బరిలో దింపిన నాయకుడి విశ్వసనీయతను వాడుకోవడం.. ఎన్నికల్లో గెలవడం.. పెట్టుబడిగా పెట్టిన సొమ్మును రాబట్టుకునేందుకు పక్కదార్లు తొక్కడం.. అవినీతినే ప్రధాన ఆదాయవనరుగా మార్చుకోవడం.. ఓటేసిన ప్రజలను వంచించడం.. రాజకీయ జన్మనిచ్చిన నేతకు వెన్నుపోటు పొడవడం.. తల్లిలాంటి పార్టీకి ద్రోహం చేయడం.. మరో గూటికి చేరిపోవడం.. మళ్లీ అక్రమాలకు కొత్తగా శ్రీకారం చుట్టడం.. ఇంతటి ఉపోద్ఘాతం ఎవరి గురించి అనుకుంటున్నారా.. అదేనండి ఇప్పటి వరకు చిత్తూరు ఎమ్మెల్యేగా చక్రం తిప్పి.. ఇప్పుడు తిరుపతి దారి పట్టారే ఆయనేనండీ బాబూ.. ఆరణి శ్రీనివాసులు అలియాస్ జంగాలపల్లి శ్రీనివాసులు. సదరు శాసనసభ్యుడి ఘనతే ఇదంతా. వైఎస్సార్‌సీపీ అండతో అందలం ఎక్కి.. తర్వాత చిత్తూరు జనాలను తొక్కి.. నియోజకవర్గంలో కనిపించిన భూములను మెక్కి.. రూ.కోట్లు బొక్కిన ఈ ఆక్రమణల అనకొండ ఇప్పుడు తన కబ్జాల పర్వం కొనసాగించేందుకు పవిత్ర తిరునగరికి పాకింది. పకడ్బందీ ప్రణాళికతో తన భూదందా చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటోంది.

- చిత్తూరు నియోజకవర్గంలో యథేచ్ఛగా భూకబ్జాలు
- సుమారు 250 ఎకరాలకు పైగా స్వాహా
- ఇప్పుడు తిరుపతిలో అక్రమాలకు సన్నాహాలు
- రూ.కోట్లు కూడబెట్టుకోవడమే అజెండా
- ఇద్దరు విశ్రాంత అధికారులతో పకడ్బందీ ప్రణాళిక
- తిరునగరిని దోచుకోవడమే లక్ష్యంగా అడుగులు

చిత్తూరు అర్బన్ : శాసన సభ్యుడిగా ఎన్నికైన వ్యక్తి ప్రజల్లో విశ్వసనీయత సంపాదించుకోవాలి. అయితే చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రజలకు పెట్టింది ఏమీలేదుకానీ.. ఆయన మాత్రం బాగానే సంపాదించుకున్నారు. ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు, దర్జాగా కబ్జా చేసేశారు. ఒకటీ, రెండూ కాదు చిత్తూరు నియోజకవర్గంలో వందల ఎకరాలను మింగేశారు. అయినా ఆరణి భూదాహం తీరలేదదు. తాజాగా పార్టీ మారి చిత్తూరు నుంచి తిరుపతికి మకాం మార్చి అక్కడ జనసేన అభ్యర్థిగా పోటీకి దిగాడు. తిరుపతిలో గెలిస్తే అక్కడి భూములను ఎలా స్వాహా చేయాలో ముందుగానే ప్రణాళిక రచించుకున్నట్లు తెలిసింది.

మాటేసి.. కాజేసి

- గుడిపాల మండలంలోని నారగల్లు రెవెన్యూ భూముల్లో దాదాపు 50 ఎకరాలను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కాజేశారు. ఈ భూమి విలువ సుమారు రూ.150 కోట్లు. ఎవరికీ ఎలాంటి అనుమానం రాకుండా తన బంధువుల పేరిట వ్యవసాయ భూముల కింద దీన్ని కేటాయించినట్లు రికార్డుల్లోకి ఎక్కించేశారు.
- గుడిపాల మండలంలోని చిత్తూరు–వేలూరు రోడ్డులో జాతీయ రహదారిని ఆనుకుని వున్న రూ.18 కోట్లు విలువ చేసే 7 ఎకరాలను ఆక్రమించేశారు. అలాగే చెన్నై–బెంగళూరు నాలుగు లేన్ల జాతీయ రహదారి సమీపంలోని రూ.3 కోట్ల విలువైన ఒక ఎకరాను తన భార్య తరపు కుటుంబీకులపై మార్చేసి, వ్యవసాయభూమిగా చూపించుకున్నారు.
- చిత్తూరులోని తేనెబండలో బెంగళూరు–కాణిపాకం ఆరు వరుసల జాతీయ రహదారి సమీపంలోని 44 ఎకరాల్లో తన కంపెనీకి చెందిన స్టోన్ క్రషింగ్ యూనిట్ కోసం కార్పొరేషన్ అధికారుల నుంచి ఎన్‌ఓసీ తీసుకున్నారు. ప్రభుత్వ పరిశీలనలో ఉండగానే 44 ఎకరాలను తన ఆధీనంలోకి తెచ్చుకున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఈ భూమి ఖరీదు రూ.200 కోట్లకు పైనే ఉంటుందని అంచనా.
- చిత్తూరులోని బండపల్లె రెవెన్యూ 194 వెంకటాపురంలో 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి, తన బినామీల పేరిట రాయించుకున్నాడు. గాండ్లపల్లె రెవెన్యూ పరిధిలో రూ.10.50 కోట్ల విలువైన 13 ఎకరాలను చదును చేయించి, తన అనుచరులతో మామిడి చెట్లు నాటించేశారు. నల్లప్పకండ్రిగలో 3 ఎకరాల బీడును తన దూరపు బంధువు పేరుపై రాయించి, ఆపై మామిడి మొక్కలు నాటించారు.
- చిత్తూరులోని 77–గాండ్లపల్లె రెవెన్యూలో సర్వే నంబరు –35/1, 36లో ఉన్న 2.84 ఎకరాలను 2012లో అప్పటి మాస్టర్‌ప్లాన్ ప్రకారం స్థానిక ప్రజల కోసం రిక్రియేషన్ క్లబ్ జోన్‌లో ఉంచారు. కానీ, ఎమ్మెల్యే ఆరణి మాత్రం రూ.15 కోట్లు పలికే ఈ స్థలాన్ని రెసిడెన్షియల్ జోన్ పరిధిలోకి తీసుకొచ్చి ఆక్రమించుకున్నారు.
- చిత్తూరు నగరంలోని బీసీ నాయుడు కాలనీలో ఒక అడుగు స్థలం రూ.4,500 పలుకుతోంది. ఇక్కడున్న కాలువ పొరంబోకును దర్జాగా కబ్జా చేసేశారు. రూ.80 లక్షలు విలువ చేసే ఈ స్థలం కబ్జాలో మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇదివరకు పని చేసిన ఓ అధికారి సహకరించినట్లు తెలిసింది.

తిరుపతి భూములపై కన్ను

ఆరణి శ్రీనివాసులు కన్ను ఇప్పుడు తిరుపతి నియోజకవర్గంలోని అత్యంత విలువైన భూములపై పడింది. ఆయన ముందు చూపు ఎలా ఉంటుందంటే.. రెండు పర్యాయాలు తాను ఎమ్మెల్యేగా చిత్తూరులో పోటీ చేసి ఓడిపోయినందుకు కూడా బాధపడరు. తన ఓటమి, గెలుపునకు ఎంతెంత ఖర్చయ్యిందో రూపాయితో సహా లెక్కలు రాసుకుంటారు. అలా చిత్తూరులో గత ఐదేళ్లుగా భూ బకాసురుడి అవతారంలో తన జమాఖర్చులను పూర్తిగా సరిచేసుకున్నారు. ప్రస్తుతం తిరుపతి నియోజకవర్గంపై కన్నేశారు. ప్రభుత్వ భూములు ఎక్కడ ఉన్నాయి..? ఎలా తెలుసుకోవాలి..? అనేదానిపై దృష్టి పెట్టారు. గతంలో తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఓ అధికారిని, ఉమ్మడి జిల్లాగా ఉన్నపుడు చిత్తూరు రెవెన్యూ విభాగంలో పనిచేసిన మరో విశ్రాంత అధికారిని వెంటబెట్టుకున్నారు. వారి ద్వారా భూ రికార్డులు, క్షేత్రస్థాయిలో తిరుపతి నియోజకవర్గంలోని భూముల స్థితిగతులను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా చిత్తూరు నుంచి ఓ బృందాన్ని తీసుకువచ్చి తిరుపతిలో ఈ వివరాలను సేకరించే పనులు అప్పగించారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు కుమ్మరించిన రూ.కోట్లను గెలిచిన తర్వాత రాబట్టుకునేందుకు పకడ్బందీగా ప్రణాళిక రూపొందించుకున్నట్లు సమాచారం.



చిత్తూరులోని బండపల్లెలో తన బినామీలకు కేటాయించిన ప్రభుత్వ భూమి.. దానికి ముళ్లకంచె వేసిన ఆరణి అనుచరులు



చిత్తూరులోని గాండ్లపల్లె రెవెన్యూలో ఆరణి శ్రీనివాసులు ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూమి

న్యూస్‌రీల్

'పోస్టల్' ఓటింగ్‌కు నేడే ఆఖరు



పోస్టల్‌బ్యాలెట్ ఓటు వినియోగించుకున్న ఉద్యోగులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 5వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ గురువారంతో ముగియనుంది. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఐదు రోజుల పాటు పాటు ఉద్యోగులు ఓటింగ్ వేసేందుకు అవకాశం కల్పించారు. జిల్లాలో బుధవారం వరకు మొత్తం 11,076 మంది పోస్టల్‌బ్యాలెట్ సద్వినియోగం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటికీ 1,071 మంది ఉద్యోగులు ఓటేయాల్సి ఉందని తెలిపారు. ఏడు నియోజకవర్గాలకు గాను అత్యధికంగా చిత్తూరు అసెంబ్లీలో 2,410 మంది ఉద్యోగులు ఓటేయగా, పుంగనూరులో 1,806, నగరిలో 1,142, జీడీ నెల్లూరులో 1,540, పూతలపట్టులో 1,476, పలమనేరులో 1,776, కుప్పంలో 926 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వాడుకున్నట్లు వివరించారు. పోలింగ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ పర్యవేక్షించారు.

సబ్‌రిజిస్ట్రార్, జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

చిత్తూరు కార్పొరేషన్: అవినీతి ఆరోపణలతో అరెస్ట్ అయిన కుప్పం సబ్‌రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య, జూనియర్ అసిస్టెంట్ మోహన్‌బాబుకు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. దీంతో నిబంధనల ప్రకారం వారిని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ డీఐజీ గిరిబాబు ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు తెలిపారు. వారి స్థానంలో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ప్రదీప్‌ను సబ్‌రిజిస్ట్రార్‌గా, పుంగనూరు జూనియర్ అసిస్టెంట్ భాస్కర్‌నాయుడును జూనియర్ అసిస్టెంట్‌గా నియమించామని వివరించారు.

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు



రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి

పలమనేరు : లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే ఆస్పత్రులు, ల్యాబ్‌లను సీజ్‌చేసి నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి హెచ్చరించారు. బుధవారం పలమనేరులోని జయభారతి స్కానింగ్ సెంటర్, కమల్ స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలపై నిషేధం ఉన్నప్పటికీ కొందరు రహస్యంగా టెస్టులు చేస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. అందుకే ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు. అనంతరం పట్టణంలోని అర్బన్ ఆస్పత్రిని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలోనే పాతపేట సచివాలయానికి వెళ్లి ప్రతి బుధవారం పిల్లలకు వ్యాక్సిన్ వేయించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు, వైద్యాధికారులు నిరంజన్‌కుమార్, ఆశ సబ్‌యూనిట్ అధికారి జయశంకర్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 65,146 మంది స్వామి వారిని దర్శించుకోగా 25,306 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.02 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

అభివృద్ధిని ఆశీర్వదించండి

- ఇచ్చిన హామీల్లో 99శాతం అమలు చేశాం
- పుంగనూరును ఆదర్శవంతంగా తీర్చిదిద్దాం
- ప్రజాసమస్యల పరిష్కారానికే పెద్దపీట వేశాం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



రొంపిచెర్ల గ్రామసభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల : పుంగనూరు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు ఆశీర్వదించాలని, ఫ్యాను గుర్తుకు ఓటేయాలని మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం రొంపిచెర్ల మండలంలోని దద్దాలవారిపల్లె, కొండారెడ్డిగారిపల్లె, బండకిందపల్లె గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం రొంపిచెర్ల గ్రామసభలో మంత్రి మాట్లాడుతూ టీడీపీ పాలనలో అభివృద్ధిని వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధిని పరిశీలించాలని కోరారు. 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు 600 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించారని విమర్శించారు. మళ్లీ మోసపు హామీలతో ప్రజల ముందుకు వస్తున్న చంద్రబాబును ఓటుతో తరిమి కొట్టాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశారని వెల్లడించారు. సీఎం జగన్ సహకారంతో పుంగనూరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి తారు రోడ్లు, సీసీ రోడ్లు, తాగునీటి ట్యాంకులు నిర్మించామని తెలిపారు. నవరత్న పథకాలతో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించామని వివరించారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇబ్రహీంఖాన్, సింగిల్ విండో అధ్యక్షుడు దేవులపల్లె హరినాథరెడ్డి, నాయకులు చెంచురెడ్డి, కమలాపురం శ్రీదేవిరెడ్డి, కోటా వెంకటరమణ, ప్రసాద్ నాయుడు, యుగంధర్ రెడ్డి, కమలాకర్ రెడ్డి, అన్వర్‌బాషా, హరికృష్ణారెడ్డి, యర్రంరెడ్డి, ఎస్.వి జయకుమార్ రెడ్డి, జి.రామచంద్రారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, నూలు రెడ్డెప్ప, నాగిరెడ్డి, భాస్కర్ రెడ్డి, చిన్న నాగరాజా, లక్ష్మయ్య, అలీంఖాన్, సురేంద్ర నాయుడు, బాబు, రామనారాయణ రెడ్డి, లక్ష్మన్న,ప్రకాష్ రెడ్డి, సైపుల్లాఖాన్ పాల్గొన్నారు.

జగన్ వెంటే జనం



పాలకలలో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్

ఐరాల: శత్రువులంతా ఏకమై ఎన్నికల బరిలో దిగినా, ప్రజలు మాత్రం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని పాలకల పంచాయతీలో ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ కూటమి అభ్యర్థులకు ఓటు వేస్తే రాష్ట్రం మరో పదేళ్లు వెనుకబడుతుందన్నారు. ప్రజలు వాస్తవాలను గమనించి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించాలని పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన, బీజేపీలు ప్రకటిస్తున్న అసత్య పథకాలను నమ్మవద్దని, మే 13న జరిగే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. చంద్రబాబు అనైతిక పొత్తులతో ప్రజలను మభ్యపెట్టేందుకు వస్తున్నారని, వారిని ఓటుతో తరిమికొట్టాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ మోహన్, నియోజకవర్గ పరిశీలకుడు మోహన్‌రెడ్డి, మహిళ, శిశు సంక్షేమ శాఖ రాయలసీమ రీజనల్ చైర్‌పర్సన్ శైలజాచరణ్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సుచిత్ర, ఎంపీటీసీ సభ్యుడు సాగర్‌రెడ్డి, నేతలు ప్రభాస్‌కుమార్‌రెడ్డి, చలపతిరెడ్డి, గణేష్‌రెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, టెరిన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శేషాద్రి, ప్రసాద్, ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమానికి పట్టం కట్టండి



డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్యే అభ్యర్థి .కృపాలక్ష్మికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

కార్వేటినగరం : వివక్ష లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మళ్లీ పట్టం కట్టాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి కోరారు. బుధవారం ఆయన స్వగ్రామం పాదిరికుప్పంలో ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన అందించారని, దళితులకు పెద్దపీట వేశారన్నారు. దళితుడికి డిప్యూటీ సీఎం పదవి కట్టబెట్టిన ఘనత జగనన్నకే దక్కుతుందని వెల్లడించారు. విజయవాడ నడిబొడ్డున 210 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసి దళిత పక్షపాతి అని నిరూపించుకున్నారని వివరించారు. అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుపై చంద్రబాబు కనీసం స్పందించలేదని మండిపడ్డారు. జీడీ నెల్లూరు నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని చూసి ఓర్వలేక టీడీపీ నేతలు డబ్బులిచ్చి తమను తిట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి చవకబారు పనులు మానుకోకుండా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. దళితుల మధ్య చిచ్చుపెట్టడమే టీడీపీ నేతల లక్ష్యమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఎమ్మెల్యే అభ్యర్థిగా మీ ముందుకొస్తున్న తన కుమార్తె కృపాలక్ష్మిని ఆదరించి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి మాట్లాడుతూ మీ బిడ్డగా మన ఊరికి వచ్చానని, ఆశీర్వదించి గెలిపించాలని అభ్యర్థించారు. తన తండ్రి, డిప్యూటీ సీఎం నారాయణస్వామిని ఆదరించినట్టుగానే తనకు ఓట్లు వేసి అఖండ మెజారిటీ అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ లత, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, మాజీ కన్వీనర్ ధనంజయవర్మ, సింగిల్ విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, దేశయ్య, రాజారత్నం, వెంకటస్వామి పాల్గొన్నారు.

'కూటమి'కి ఓటమి తప్పదు



ఎన్నికల ప్రచారంలో మంత్రి రోజా

నగరి : ఎన్నికల్లో కూటమికి ఓటమి తప్పదని, ఫ్యాన్ ప్రభంజనం తథ్యమని మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌కే రోజా తెలిపారు. బుధవారం మండలంలోని తడుకుపేట, ముడిపల్లె, మేళపట్టు పంచాయతీల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రికి ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి రోజా మాట్లాడుతూ 35 ఏళ్లలో ఎవరూ చేయని అభివృద్ధిని తాను చేసినట్లు వెల్లడించారు. ఎలాంటి గొడవలు లేకుండా నియోజకవర్గంలో ప్రశాంతవాతావరణ నెలకొల్పామని తెలిపారు. ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందించామన్నారు. ప్రజాసేవే పరమావధిగా అహర్నిశలు పనిచేస్తున్నామని, మరింత సేవలందించేందుకు ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. మూడో పర్యాయం ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గాంధీ, ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, పార్టీ మండల కన్వీనర్ సుదర్శననాయుడు, సచివాలయాల మండల కన్వీనర్ హరి, సర్పంచ్‌లు ప్రకాష్, శ్రీదేవి, కౌసల్య, నాయకులు సంజీవిరెడ్డి, శేఖర్‌శెట్టి, నాగరత్నం, కోదండరెడ్డి పాల్గొన్నారు.

డౌన్‌లోడ్.. ఓటర్ స్లిప్!



ఓటర్ స్లిప్ ఆన్‌లైన్ వెబ్‌సైట్

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి ఓటరు స్లిప్‌లను బీఎల్‌ఓలు పంపిణీ చేస్తున్నారు. అయితే ఓటర్ స్లిప్‌లు అందని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వెబ్‌సైట్ నుంచి నేరుగా ఓటరు స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటును ఎన్నికల సంఘం కల్పించింది. ఈ క్రమంలో రెండు విధానాలను అందుబాటులోకి తీసుకువచ్చింది.

మొదటి విధానం

ఆన్‌లైన్‌లో www.electoralsearch.in వెబ్‌సైట్‌ను ఓపెన్ చేయాలి. అందులో తొలుత సెర్చ్ బై డిటైల్స్ క్లిక్ చేసి పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, తదితర వివరాలను నమోదు చేయాలి. అసెంబ్లీ నియోజకవర్గం ఎంపిక చేసుకోవాలి. తర్వాత కింది భాగంలో కనిపించే క్యాప్చర్ కోడ్‌ను దాని పక్కనే ఉన్న గడిలో టైప్ చేసి సెర్చ్ ఆప్షన్ క్లిక్ చేస్తే వెంటనే ఓటర్ స్లిప్ డిస్‌ప్లే అవుతుంది.

రెండో విధానం

ఓటర్ ఐడీ కార్డు ఎపిక్ నంబర్‌ను సంబంధిత గడిలో ఎంటర్ చేయాలి. రాష్ట్రం ఎంపిక చేసుకున్న తర్వాత కింద కనిపిస్తున్న క్యాప్చర్ కోడ్‌ని గడిలో ఎంటర్ చేసి సెర్చ్ నొక్కాలి. తర్వాత ఓటరు వివరాలు కనిపిస్తాయి. పేరుకు ముందు వ్యూ డిటైల్స్ అని ఉంటుంది. దానిపైన క్లిక్ చేస్తే ఓటరు పూర్తి వివరాలతో ఫొటో లేని ఓటరు స్లిప్ కనిపిస్తుంది. దానిని డౌన్‌లోడ్ చేసుకుని ప్రింట్ తీసుకోవాలి.

'గుడ్'మార్నింగ్



సంక్షేమ వెలుగులు..
ప్రగతి పరుగులు

ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా 'సాక్షి' బృందం బుధవారం చిత్తూరు నియోజకవర్గంలో పర్యటించింది. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ స్థానికుల మనసులో మాటను రాబట్టింది. ముందుగా చిత్తూరు నగరంలో మొదలైన రోడ్ షో గుడిపాల.. వసంతాపురం.. బసవాపల్లె.. శ్రీరంగంపల్లె.. పేయనపల్లె.. చీలాపల్లె.. తాళంబేడు.. గువ్వకల్లు.. పెరుమాళ్లకండ్రిగ మీదుగా కొనసాగింది. ఈ క్రమంలో ఒకప్పుడు పూర్తిగా వెనుకబడిన నియోజకవర్గం రూపురేఖలు ఇప్పుడు సమూలంగా మారిపోయాయి. అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిన ప్రాంతంలో ప్రగతి వెలుగులు దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కాంతులు లబ్ధిదారుల చిరునవ్వుల్లో కనిపిస్తున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధి అలసత్వం వహించినా.. సర్కారు చొరవ కారణంగా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి.

– చిత్తూరు అర్బన్/చిత్తూరు రూరల్/గుడిపాల/చిత్తూరు కార్పొరేషన్/చిత్తూరు అగ్రికల్చర్/ చిత్తూరు కలెక్టరేట్

- అభివృద్ధి పథంలో చిత్తూరు
- అత్యున్నతంగా మౌలిక వసతులు
- గత ఐదేళ్లలో మారిన రూపురేఖలు
- వివక్ష లేకుండా ప్రభుత్వ పథకాలు
- సచివాలయాల ద్వారా ఇంటిముంగిటకే సేవలు

గుడిపాల మండలంలో...

మండలంలోని మొత్తం 27 పంచాయతీల్లో 17 గ్రామ సచివాలయాలను నిర్మించారు. అలాగే రైతు భరోసా, వెల్‌నెస్ కేంద్రాలు నిర్మించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలను అందిస్తున్నారు. గతంలో ఏది కావాలన్నా మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేవి. పంటలకు సంబంధించి మందులు కావాలంటే చిత్తూరుకు, ఇటు తమిళనాడులోని వేలూరుకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ సమస్యలన్నీ తొలగిపోయాయి. ఆర్‌బీకేల ద్వారానే అన్నీ అందుతున్నాయి.



గుడిపాలలోని రైతుభరోసా కేంద్రం,

చిత్తూరుకు పోవాల్సిన పనిలేదు



గతంలో ఏమి కావాలన్నా చిత్తూరుకు వెళ్లే వాళ్లం. ప్రస్తుతం మాకు అన్నీ ఆర్‌బీకేల ద్వారానే అందుతున్నాయి. సచివాలయం ద్వారా సర్టిఫికెట్లను కూడా వలంటీర్లు ఇంటి వద్దకే తీసుకువచ్చి అందిస్తున్నారు.ఈ ప్రభుత్వంలో అన్ని పథకాలు మాకు సక్రమంగా వస్తున్నాయి. ఇక ఏ పనికీ చిత్తూరుకు పోవాల్సిన పనిలేదు. మాలాంటి గ్రామీణులను ఇంతగా పట్టించుకున్న వారి కోసమే పనిచేస్తాం.

- రామకృష్ణారెడ్డి, వసంతాపురం

మా కష్టం తెలిసిన వారికే..



మాలాంటి వృద్ధులు ఈ ప్రభుత్వంలో క్షేమంలో ఉన్నారు. ఒకటో తేదీన ఇంటి వద్దకే పింఛన్లు కూడా అందిస్తున్నారు. ఈ రెండు నెలలుగానే కొంతమంది కారణంగా పింఛన్ల కోసం నానా ఇబ్బందులు పడుతున్నాం. ఆరోగ్య సురక్ష పథకం ద్వారా వైద్యుల ద్వారా సేవలు పొందాం. మందులూ, మాత్రలను ఉచితంగానే తీసుకుంటున్నాం. మాకష్టం తెలిసిన వారికే మద్దతుగా నిలుస్తాం. ఆదరించి ఆశీర్వదిస్తాం.

- గోవిందరెడ్డి, గుడిపాల

చిత్తూరు రూరల్ మండలంలో..

మండలంలో ఈ ఐదేళ్లలోనే అభివృద్ధి పనులు పరుగులు పెట్టాయి. ప్రధానంగా సచివాలయం నిర్మాణానికి ప్రభుత్వం రూ. 2.50కోట్లు వ్యయం చేసింది. రైతు భరోసా కేంద్ర భవన నిర్మాణానికి రూ. 1.08కోట్లు వెచ్చించింది. హెల్త్ సెంటర్ల నిర్మాణానికి రూ. 1.4 కోట్లుర, సీసీ రోడ్లకు రూ. 3 కోట్లు, డ్రైనేజీ నిర్మాణానికి రూ. 2కోట్లు ఖర్చు చేసింది.



చిత్తూరు మండలం చింతలగుంటలోని విలేజ్ హెల్త్ క్లినిక్

ఊళ్లో ఆస్పత్రి వచ్చినాది..



ఇప్పుడు లేనోడికి మంచిగా ఆరోగ్య సేవలు అందుతా ఉండాయి. అంతకు ముందు రోగం వస్తే సిత్తూరికి పరుగెడుతున్నాం. ఈ ప్రభుత్వం వచ్చినాక..మా ఊళ్లో ఆస్పత్రి వచ్చినాది. ఈడే అన్ని పరీక్షలు చేసి బాగానే చూస్తా ఉండారు. ఏ రోగానికైనా మందులు, మాత్రలు ఇస్తుండారు. మంచిగానే చేస్తా ఉండాది ఈ గవర్నమెంట్. దీనికి మంచి యా గవర్నమెంట్ చేయదు. మాలాంటి పేదలకు ఈ ఆస్పత్రి బాగానే ఉపయోగ పడతా ఉండాది. డాక్టర్లు కూడా ఊర్లోకి వచ్చి చూస్తుండారు.

- దాము, గువ్వకల్లు, చిత్తూరు మండలం

మురుగు మరుగైంది



మా వీధిలో ఉన్న మురుగు నీటి కాలువ చెత్త చెదారంతో నిండిపోయేది. మురుగు నీళ్లు, చెత్త చెదారం కలిసి దుర్వాసన వెదజల్లేది. పాములు కూడా కాలువలో తిరుగుతూ ఉండేది. దోమలు విజృంభించేవి. సాయంత్రమైతే ఈ దోమల బెడదకి కాసేపు కూడా వీధిలో కూర్చునే పరిస్థితి ఉండేది కాదు. ఈ ప్రభుత్వం వచ్చాక మురుగును మరుగు చేశారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించారు. దీంతో దుర్వాసన దూరమైంది. దోమల బెడద పూర్తిగా తగ్గింది. మంచిగా చేసేవాళ్ల వైపే మేమందరం ఉంటాం.

- నాగభూషణమ్మ, గువ్వకల్లు, చిత్తూరు మండలం

ప్రశాంతంగా ఉంటాది



గంగినేని చెరువు వద్ద ఉన్న పార్కు సానా బాగుండాది. నేను లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నా. డ్యూటీ లేనప్పుడు ఇక్కడ వచ్చి కూర్చుంటే ప్రశాంతంగా ఉంటాది. పార్కులో పచ్చని చెట్లు బాగుండాయి. లోపలకు పోవడానికి డబ్బు కూడా తీసుకోరు. అప్పుడప్పుడు ఇంట్లోవాళ్లతో వస్తా. పిల్లోళ్లు ఆడుకునేందుకు చాలా సామాన్లు పెట్టారు. ఈవిధంగా చిత్తూరును పట్టించుకున్నవాళ్లకే నా మద్దతు.

- మోహన్, లారీ డ్రైవర్, వినాయకపురం చిత్తూరు

ఇరుకు రోడ్డు పోయింది



మాకు ఎన్నో ఏళ్లుగా కొంగారెడ్డిపల్లెలో చిల్లర అంగడి ఉంది. రోజు మార్కెట్ నుంచి సరుకులు తెచ్చుకుంటాం. ఇంటికి, మార్కెట్‌కు తిరగతా ఉంటాం. ఇంతకు ముందు ఇరుకు రోడ్డు, దానికి తోడు గుంతలు ఉండటంతో నడుములు పోయేవి. ట్రాఫిక్‌తో టెన్షన్ వస్తా ఉండేది. ఇపుడు రోడ్డును పెద్దదిగా చేసి విస్తరించారు. ముందున్న ఇబ్బందులు ఇప్పుడు లేవు. పాత రోడ్డు ఉన్నపుడు తరుచూ ప్రమాదాలు జరిగేవి. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. ఇంతచేసిన వాళ్లకే అండగా ఉంటాం.

- రాజ్‌కుమార్, కొంగారెడ్డిపల్లె, చిత్తూరు

చిత్తూరు నగరంలో..

నగరంలోని గంగినేని చెరువు వద్ద గల జగజ్జీవన్‌రామ్ మున్సిపల్ పార్కును ప్రభుత్వం అద్భుతంగా అభివృద్ధి చేసింది. పిల్లలు ఆడుకోవడానికి అన్ని రకాలు ఆట వస్తువులను సమకూర్చింది. ఈ పార్కు ఎలాంటి ప్రవేశ రుసుము లేకుండా ప్రజలకు ఆహ్లాదం పంచుతోంది. గతంలో ఇరుకుగా ఉన్న కొంగారెడ్డిపల్లె రోడ్డును విస్తరించారు. ట్రాఫిక్ ఇక్కట్లను తొలగించేందుకు ఆక్రమణలు తొలగించారు. అందుబాటులోని బస్‌షెల్టర్‌ను ఆధునికీకరించారు. అలాగే గాంధీ విగ్రహ కూడలిని అద్భుతంగా తీర్చిదిద్దారు. చిత్తూరుకు ఐకాన్‌గా మార్చారు. జిల్లా కేంద్రంలో 15 న్యాయస్థానాలు ఒకే చోట ఉండేలా రూ.42 కోట్ల వ్యయంతో కోర్టు కాంప్లెక్సు నిర్మించారు.



చిత్తూరులో నూతనంగా నిర్మించిన జిల్లా కోర్టు కాంప్లెక్సు



పార్కులో ఆడుకుంటున్న పిల్లలు

అభివృద్ధిని చూస్తున్నాం



చిత్తూరులో 20 ఏళ్లుగా డెవలప్‌మెంట్ లేదు. ఈ ప్రభుత్వంలోనే అభివృద్ధి పనులు జరిగాయి. కాలనీల పక్కనే సచివాలయాలు ఏర్పాటు చేశారు. ఏం సర్టిఫికెట్లు కావాలన్నా అక్కడకు వెళితే పని అవతా ఉండాది. లంచాలు ఇచ్చేది లేదు. ఏదైనా సమస్య ఉంటే వాట్సాప్‌లో ఓ మెసేజ్ పెడితే ఆఫీసర్లు పట్టించుకుంటా ఉండారు. ఈమాత్రం ఉంటే చాలు. ఇంత చేస్తున్న నాయకులకు, ప్రభుత్వానికి కాకుండా.. ఎవరో వచ్చి ఏదో ఇస్తారని మోసపోయే పరిస్థితిలో మేము లేము.

- భాస్కర్, మురకంబట్టు, చిత్తూరు

ఆదుకున్నవారికే అండగా ఉంటాం



నేను చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మికుడిని. గత ప్రభుత్వ హయాంలో అర్ధాంతరంగా ఫ్యాక్టరీని మూసివేయడంతో మాలాంటి కార్మికుల బతుకులు వీధిన పడ్డాయి. కనీసం మాకు ఇవ్వాల్సిన పెండింగ్ బకాయిలు కూడా చెల్లించక ఇబ్బందులు పెట్టారు. అయితే ఈ ప్రభుత్వం మాకు సహకారం అందించింది. రూ. 32 కోట్ల పెండింగ్ బకాయిలను ఒకేసారి చెల్లించింది. మమ్మల్ని ఆదుకున్న వారికే అండగా ఉంటాం. అదే న్యాయం.

- కె.దేవేంద్రరెడ్డి, దొడ్డిపల్లె, చిత్తూరు

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు



పార్టీలో చేరిన యువకులతో ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు : నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి టీడీపీ, జనసేన నేతలు భారీగా వైఎస్సార్‌సీపీలోకి వలస వస్తున్నారు. బుధవారం పలమనేరు పట్టణంలోని 60 మంది టీడీపీ, జనసేకు చెందిన యువకులకు ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ కండువాలు కప్పి పార్టీలో సాదరంగా ఆహ్వానించారు. అలాగే గడ్డూరుకు చెందిన 20 టీడీపీ కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు.

వి.కోటలో..

వి.కోట: మండలంలోని ఓగు పంచాయతీకి చెందిన నాయకులు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మహేష్, నాగరాజు, గంగప్ప, అమరనాథ్, భానుచంద్ర తదితరులు ఉన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే వెంకటేగౌడ

కారు ఢీకొని వ్యక్తి మృతి

గంగవరం : మండల కేంద్రంలోని బాలాజీభవన్ వద్ద మంగళవారం రాత్రి కారు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. కర్ణాటకలోని గంజికుంట గ్రామానికి చెందిన బాబాజాన్(40) పెయింటర్‌గా పనిచేస్తూ కొంతకాలంగా పలమనేరులో నివసిస్తున్నాడు. ఈ క్రమంలో వ్యక్తిగత పనిమీద సంగిళి గ్రామం వెళ్లిన బాబా జాన్ తిరుగుప్రయాణంలో బాలాజీ భవన్ వద్ద బస్సు దిగి రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగింది. దీంతో బాబా జాన్ అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చిన్నగోవింద్ తెలిపారు.

పాలిసెట్ ఫలితాల్లో విశ్వం విజయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న విశ్వం విద్యాసంస్థ అకడమిక్ డైరెక్టర్, కరస్పాండెంట్ తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పాలిసెట్-2024 పరీక్షా ఫలితాల్లో తిరుపతి వరదరజనగర్‌లోని విశ్వం విద్యాసంస్థ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు, ర్యాంకులతో విజయకేతనం ఎగురవేసినట్లు ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎస్.విశ్వనాథరెడ్డి తెలిపారు. పాలిసెట్‌కు హాజరైన తమ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకుతో పాటు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సొంత చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ఫలితాల్లో తమ విద్యార్థి కె.సాహిత్ 120మార్కులకు 118మార్కులు సాధించి జిల్లా స్థాయి ప్రథమ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. అలాగే సి.తన్మయి, కె.నిత్యశ్రీ కల్యాణి, ఎం.విగ్నేష్, లక్ష్మీశ్రీవర్ధన్‌లతో పాటు పలువురు విద్యార్థులు రాష్ట్ర, జిల్లాస్థాయి ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. అనంతరం వీరిని ఆ విద్యాసంస్థ అకడమిక్ డైరెక్టర్ విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎస్.తులసీ విశ్వనాథరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఐఏఎస్ కావడమే లక్ష్యం



ఐఏఎస్ కావడమే తన లక్ష్యమని పాలిసెట్-2024 ఫలితాల్లో వడమాలపేట మండలం, కదిరి మంగళంకు చెందిన కొమిండల సాహిత్ 120మార్కులకు 118 మార్కులు సాధించాడు. రైతు కుటుంబానికి చెందిన కె.మునిశేఖర్, కె.రామతులసి దంపతుల కుమారుడు సాహిత్ విశ్వం విద్యాసంస్థలో పాలిసెట్‌కు శిక్షణ తీసుకుని జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. భవిష్యత్తులో ఐఏఎస్ సాధించి పేద ప్రజల కు సేవ చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నాడు.

- కె.సాహిత్

పాలిసెట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ


వినయ్

రోషిత

గౌరిప్రియ

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని పలువురు విద్యార్థులు బుధవారం విడుదల చేసిన పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షల (పాలిసెట్) ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. నగరంలోని మిట్టూరులో ఉన్న కుట్టి స్టడీ సర్కిల్‌లో కోచింగ్ పొందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారని స్టడీ సర్కిల్ డైరెక్టర్ పవనకుమారి తెలిపారు. శిక్షణ పొందిన వినయ్ 6,302, రోషిత 12,432, గౌరిప్రియ 22,187 ర్యాంకులు సాధించారని, వీరు ఎస్వీయూ పరిధిలో వందలోపు ర్యాంకులు పొందారని వివరించారు. అలాగే మిట్టూరులోని ప్రతిభా ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీలో శిక్షణ పొందిన వేదప్రకాష్ 1,610, రితిక 2,656, జశ్వంత్ 2,875 ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాళ్లు యోగానంద్, పద్మనాభరెడ్డి వెల్లడించారు. అనంతరం సత్తా చాటిన విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

సెబ్ స్టేషన్ తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న సెబ్ డిప్యూటీ కమిషనర్

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌ను బుధవారం రాయలసీమ సెబ్ డిప్యూటీ కమిషనర్ టి.విజయ శేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను పరిశీలించారు. ఎన్నికల సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ వి.శ్రీనివాస మూర్తి, ఎస్ఐ చైతన్య పాల్గొన్నారు.